సాక్షి
సంగారెడ్డి
బుధవారం | 4 | జూన్ | 2025



బాలిక విద్యకు మరింత భరోసా
బాలికల విద్య కోసం జిల్లాలో ఏడు కేజీబీవీలను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది.
వివరాలు 8లో ▸



దంపతుల ఆత్మహత్య
మునిపల్లి మండలం పెద్ద గోపులారంలో కుటుంబ కలహాలతో భార్యాభర్త ఆత్మహత్యకు పాల్పడ్డారు.
వివరాలు 8లో ▸



మామిడి టంకర్లతో ఉపాధి
ఖేడ్ మండలంలోని తడ్కల్ గ్రామంలో మామిడి టంకర్ల తయారీలో కూడా ఉపాధి పొందుతున్నారు.
వివరాలు 9లో ▸

జిల్లా వ్యవసాయాధికారితో 'సాక్షి' ఫోన్ ఇన్

సంగారెడ్డి జోన్: వానాకాలం సీజన్‌లో పంటల సాగు, విత్తనాల ఎంపిక, తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు ఎరువుల వినియోగం తదితర సందేహాలు తీర్చుకునేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్‌తో ఈనెల 6న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 'ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రైతులు ఆయనతో మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.





తేదీ : 06-06-2025
సమయం : ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్లు :
9949992039, 9505872923

చెరువు కట్టలు భద్రమేనా?

- వర్షాకాలం నేపథ్యంలో నీటిపారుదలశాఖ అప్రమత్తం
- మరమ్మతులు చేపట్టాలి
- క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : వర్షాకాలంలో చెరువులు, కుంటల నిర్వహణపై నీటిపారుదల శాఖ దృష్టి సారించింది. భారీ వర్షాలతో వరద నీరు వచ్చి కట్టలు తెగిపోవడం, బుంగలు పడటం, కాలువలు ధ్వంసం కావడం వంటి జరిగే అవకాశాలుండటంతో ఆ శాఖ అప్రమత్తమైంది. గతేడాది వర్షాకాలంలో 75 శాతానికి మించి నిండిన చెరువులు, అలుగులు పారిన చెరువుల పరిస్థితిపై ఆరా తీస్తోంది. ఈ చెరువుల కట్టలు ఎక్కడైనా బలహీనంగా ఉన్నాయా? తూములు మరమ్మతులు అవసరం ఉంటాయా? అలుగుల పరిస్థితి ఎలా ఉంది? 75 శాతానికి మించి నీళ్లు చేరితే కట్టలు తెగే అవకాశాలు ఏమైనా ఉన్నాయా? అనేది పరిశీలించాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించింది. ఆయా మండలాల ఏఈఈలు, డీప్యూటీఈఈలు ఈ చెరువులను వెంటనే పరిశీలించాలని ఆదేశాలు వెళ్లాయి. ఎక్కడైనా బుంగలు పడితే తక్షణం మరమ్మతులు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

75%కు మించి నిండిన చెరువులు 748

నీటి పారుదలశాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో 1,769 చెరువులున్నాయి. ఇందులో 100 ఎకరాల లోపు ఆయకట్టు ఉన్న చిన్న చెరువులతోపాటు, వంద ఎకరాలకు మించి ఆయకట్టున్న చెరువులు కూడా ఉన్నాయి. గతేడాది వర్షాలు విస్తారంగా కురవడంతో సెప్టెంబర్‌లోనే సుమారు 748 చెరువులు నిండాయి. ఇందులో 218 చెరువులు అలుగు పారగా, 75 శాతానికి మించి నిండిన చెరువులు 530 వరకు ఉంటాయి. ఇలా 75% నిండిన చెరువుల్లోకి ఈ వర్షాకాలంలో కూడా వరదనీరు వచ్చి చేరే అవకాశాలుండటంతో ఈ చెరువులపై ఈ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎక్కడైనా చెరువుల కట్టలు ధ్వంసమైతే తక్షణం మరమ్మతులు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని క్షేత్రస్థాయి అధికారులను ఆ శాఖ ఆదేశించింది. అలాగే అలుగులు, తూములను మరమ్మతులు చేయాలని సూచించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై నీటిపారుదలశాఖ అధికారులతో కలెక్టర్ వల్లూరు క్రాంతి ఇటీవల సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు.



నదీ పరీవాహక ప్రాంతాల్లో..

జిల్లాలో నదీ పరీవాహక ప్రాంతాల్లో గతంలో ఎప్పుడైనా ముంపునకు గురైతే ఆ ప్రాంతాల్లో ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లాలో ప్రధానంగా మంజీర, నక్కవాగు వంటివి ఉన్నప్పటికీ..ఈ పరీవాహక ప్రాంతాల్లో ముంపు ముప్పు పెద్దగా ఉండదు.

సమస్యలు దృష్టికి తీసుకురండి

రెవెన్యూ సదస్సులో కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి టౌన్/సంగారెడ్డి జోన్/ సంగారెడ్డి ఎడ్యుకేషన్ : నూతన రెవెన్యూ చట్టం భూ భారతి అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రతీ చిన్న సమస్యను ఈ సదస్సుల్లో తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్‌పేట గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డితో కలిసి పాల్గొన్నారు. అంతకుముందు మహిళలకు రుణాలపై కలెక్టరేట్‌లో బ్యాంకు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ...రైతులు ఏ చిన్న భూ సమస్యనైనా రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా మిగిలిన అన్ని మండలాల్లో 'ప్రజల వద్దకే రెవెన్యూ నినాదం'తో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 6 నుంచి 19 వరకు బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు సమస్యలు పరిష్కరిస్తారన్నారు. టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి మాట్లాడుతూ..గతంలో ప్రభుత్వం తెచ్చిన ధరణితో రైతులు కార్యాలయాల చుట్టూ,కోర్టుల చుట్టూ తిరిగి ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన భూ భారతి రైతుల చుట్టమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవీందర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి ఖాసీం బేగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న కలెక్టర్ క్రాంతి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి

బియ్యం కోసం బారులు





ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి ఇస్తుండటంతో సంగారెడ్డిలో బియ్యం తీసుకోవడానికి జనం బారులు తీరారు. తమ వంతు ఎప్పుడు వస్తుందోనని గంటల తరబడి క్యూలో వేచి ఉంటున్నారు. బియ్యం తీసుకోవడానికి వచ్చినవారు మూడుసార్లు వేలిముద్ర ఇవ్వాల్సి రావడంతో రోజంతా నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. మధ్యాహ్నం సమయంలో ఎండవేడి, ఉక్కపోత భరించలేక చిన్న పిల్లల తల్లులు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. కొన్నిచోట్ల బియ్యం త్వరగా తీసుకోవాలనే ఆతృతలో "నేను ముందు వచ్చాను అంటే నేను ముందు వచ్చాను"అని కొట్లాడుకున్నారు. కొన్ని రేషన్ దుకాణాల వద్ద మంగళవారం కనిపించిన దృశ్యాలను 'సాక్షి'క్లిక్‌మనిపించింది.
-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ , సంగారెడ్డి

న్యూస్‌రీల్

ఒక్క దరఖాస్తు అందలేదు

రెవెన్యూ సదస్సులో అదనపు కలెక్టర్



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అదనపు కలెక్టర్ మాధురి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం రెవెన్యూ పరిధిలోని బండ్లగూడలో మంగళవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఒక్క దరఖాస్తు కూడా అందలేదని అదనపు కలెక్టర్ మాధురి పేర్కొన్నారు. భూ భారతి సదస్సులో పాల్గొన్న ఆమె అక్కడి సమస్యలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సదస్సులో తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై నమ్మకంతో సమ్మె విరమించాం

టీఎంయూ రాష్ట్ర నాయకుడు అశ్వత్థామరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అశ్వత్థామరెడ్డి

పాపన్నపేట(మెదక్): ప్రభుత్వంపై నమ్మకంతోనే ఆర్టీసీలో తలపెట్టిన సమ్మెను విరమించామని టీఎంయూ రాష్ట్ర నాయకుడు అశ్వత్థామరెడ్డి తెలిపారు. ఏడుపాయల్లో మంగళవారం జరిగిన ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ...ఆర్టీసీ కార్మికులు అనేక సమస్యలతో సతమవుతున్నారని చెప్పారు. వీటి పరిష్కారం కోసం అనేక సార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా, ఫలితం లేకుండా పోయిందన్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు సిద్ధమయ్యామని చెప్పారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సమ్మె విరమించుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎంఆర్‌కే రావు, శాభన్న, అశ్వక్, వెంకన్న, నర్సింహులు, ముత్యం,హన్మయ్య, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

బాగారెడ్డి సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

జహీరాబాద్: ఉమ్మడి మెదక్ జిల్లాకు మాజీమంత్రి దివంగత ఎం.బాగారెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యేలు కె.మాణిక్‌రావు, సంజీవరెడ్డి పేర్కొన్నారు. జహీరాబాద్‌లో బాగారెడ్డి 21వ వర్ధంతి సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నాలుగు దశాబ్దాల కాలంగా జిల్లాలో బాగారెడ్డి చెరగని ముద్ర వేశారన్నారు. అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి సేవలందించారని ఆయన సేవలను కొనియాడారు. ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, బాగారెడ్డి తనయుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్నపాటిల్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, పట్టణ ప్రముఖులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్

నర్సాపూర్ రూరల్/పాపన్నపేట(మెదక్)హవేళీఘనపూర్ (మెదక్): భూ సమస్యలున్న ప్రతీ ఒక్కరు భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ నగేశ్ సూచించారు. మండలంలోని మంతూర్, గొల్లపల్లి, పాపన్నపేట మండలం ముద్దాపూర్, మెదక్ మండలంలోని పేరూర్ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎవరికైనా భూ సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారి కోసమే ఈ సదస్సులు ఏర్పాటు చేసిందని తెలిపారు. ఫిర్యాదులపై తహసీల్దార్ విచారణ జరిపి,తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. అక్కడ పరిష్కారం లభించక పోతే ఆర్డీఓకు, ఆపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. మంతూర్‌లో 57, గొల్లపల్లిలో 47, ముద్దాపూర్, కొంపల్లి గ్రామాల్లో 68 భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.



మంతూర్ సదస్సులో దరఖాస్తు తీసుకుంటున్న అదనపు కలెక్టర్ నగేశ్

నేటి నుంచి ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలు ప్రారంభం

మెదక్ కలెక్టరేట్: మెదక్ ప్రభుత్వ ఐటీఐలోని పలు ట్రేడ్‌లలో బుధవారం నుంచి ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. కళాశాలలో కోపా(కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్), డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడ్‌లు ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతిభ ఆధారంగా ఎంపిక ఉంటుందని, విద్యార్థినులకు 33% రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇక గ్రామాలే విత్తన బ్యాంకులు

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: రైతుల సంక్షేమమే ప్రధానంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇక నుంచి గ్రామాలే విత్తన బ్యాంకులుగా పని చేస్తాయని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఖేడ్ మండలం జూకల్ శివారులోని రైతువేదికలో మంగళవారం అభ్యుదయ రైతులకు నాణ్యమైన విత్తన బస్తాలను ఆయన పంపిణీ చేశారు. అంతకుముందు ఝరాసంగం ఆలయకమిటీ నూతన బోర్డుసభ్యులుగా నియమితులైన ఈశ్వరప్పను ఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి సన్మానించారు. అనంతరం బాణాపూర్ గ్రామంలో భూభారతిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ... గతప్రభుత్వం విత్తనాలు, వ్యవసాయ పనిముట్లపై రాయితీని ఎత్తివేసి రైతులపై భారం మోపిందన్నారు. ప్రస్తుత ప్రజాపాలన ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేసి గ్రామస్థాయిల్లోనే విత్తన బ్యాంకులు ఏర్పాటు జరిగేలా శ్రీకారం చుట్టిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరిట లక్షలాదిమంది రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపింఅరు. అన్యాయాన్ని సరిద్దిడానికి భూ భారతి చట్టం తీసుకువచ్చి రైతుల భూసమస్యలను పరిష్కరించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చేందకు పక్కా ఇండ్లను మంజూరు చేస్తుందని తెలిపారు. అనంతరం బాణాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ నూతన్ కుమార్, ఏవో శంకర్, నాయకులు రమేశ్‌చౌహన్, తాహెర్ అలీ, పండరీరెడ్డి, శంకర్ ముదిరాజ్, నెహ్రూనాయక్, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.



జూకల్ రైతు వేదికలో విత్తన బస్తా పంపిణీ చేస్తున్న సంజీవరెడ్డి

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించారు. హత్నూర మండలం దౌల్తాబాద్ చౌరస్తాలో మంగళవారం కార్యకర్తలు ఏర్పాటు చేసిన మాజీమంత్రి హరీశ్‌రావు జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే కేక్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ...హరీశ్‌రావు నిత్యం ప్రజల సంక్షేమం కోసం పనిచేసే నాయకుడన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పరిపాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారంటీల అమలులో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకత్వంపై విమర్శించడం తప్ప కాంగ్రెస్ నాయకులకు పనేమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పాటుపడాలని భూభారతి ద్వారా భూ సమస్యలను వెంటనే 100% పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహులు, నాయకులు రవికుమార్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హరీశ్‌రావు జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న సునీతారెడ్డి

పీఏసీఎస్ డైరెక్టర్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

హత్నూర మండలం గుండ్ల మాచనూర్ పీఏసీఎస్ డైరెక్టర్ బేగరి సాయిలు ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని సునీతారెడ్డి పరామర్శించి ఓదార్చారు. మండల కేంద్రంమైన హత్నూరలోని మాజీ జెడ్పీటీసీ ఆశయ్య అనే గ్రామపంచాయతీ కార్మికుడు గుండెపోటుతో ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని కూడా ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- మంత్రి దామోదర రాజనర్సింహ
- సంక్షేమ పథకాలపై అధికారులతో సమీక్ష

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేవిధంగా చూడాలని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం జిల్లా పరిషత్తు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు రహదారులు ముఖ్యం అని, రహదారులు అనుసంధానం చేస్తే విద్య ఉపాధి మార్గాలు పెరుగుతాయని చెప్పారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో మందులు నిల్వ ఉంచాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో ఇసుక కొరత లేదని తెల్పి చెప్పారు. సమీక్షలో అదనపు కలెక్టరు చంద్రశేఖర్, మాధురి, జెడ్పీసీఈఓ జానకి రెడ్డి పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి రాజనర్సింహ

'యువ వికాసం' అమలులో జాప్యం ఎందుకు?

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య

మెదక్ కలెక్టరేట్: రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హులను గుర్తించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య విమర్శించారు. ఈ పథకం లబ్ధిదారుల జాబితాను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మెదక్‌లో మంగళవారం జరిగిన సీపీఎం పార్టీ జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం పథకం పేరుతో ఉపాధి కల్పిస్తామని చెప్పి యువతను ఆకర్షించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈరోజు పథకం అమలులో తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. ఇప్పుడు ఊహించిన దాని కంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు అందడంతో అనర్హులను గుర్తించి తొలగిస్తామంటూ జాప్యం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ, జిల్లా కోరింగల మల్లేశం, బాలమణి, బసవరాజు, జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి బడి బాట

19 వరకు నిర్వహణ
- బడుల్లో ప్రవేశాల పెంపే లక్ష్యం

నారాయణఖేడ్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ప్రభుత్వ పాఠశాలల్లో బడీడు పిల్లలను బడిలో చేర్పించడం కోసం ఈనెల 6 నుంచి 'బడి బాట'కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రతీ ఏడాది నిర్వహిస్తున్నట్లుగానే ఈ ఏడాది కూడా 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట'ను విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే రోజువారీ నిర్వహించాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్, మార్గదర్శకాలను పాఠశాల విద్య డైరెక్టర్ విడుదల చేశారు. గతానికి భిన్నంగా ఇప్పటికే ఉపాధ్యాయులకు మూడు విడతలుగా ఐదురోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సర్కారు పాఠశాలలను బలోపేతం చేసేందుకు పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, నిష్ణాతులైన ఉపాధ్యాయులు, సౌకర్యాలు తదితర అంశాలను తల్లిదండ్రులకు వివరిస్తూ వారి పిల్లలు సర్కారు బడుల్లో చేర్పించేలా కార్యక్రమాలకు రూపకల్పన చేశారు.

పిల్లలకు, తల్లిదండ్రులకు స్వాగత కార్యక్రమాలు

ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న సందర్భంగా ఆ రోజున పాఠశాలలను ప్రత్యేకంగా అలంకరించి పండగ వాతావరణంలో తల్లిదండ్రులు, ప్రజలకు స్వాగతం పలకాలని ఉపాధ్యాయులు యోచిస్తున్నారు. అదేరోజు ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేస్తూ పేరెంట్స్ టీచర్ మీటింగ్ (పీటీఎం) నిర్వహించాలని అధికారులు సూచించారు.

టీఎస్ యూటీఎఫ్ ప్రచార జాత..

'బడిబాట'కు ముందే టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంలో భాగంగా జిల్లాలో ఇప్పటికే ఐదు రోజుల పాటు ప్రచార జాత నిర్వహించారు. సంఘం నాయకులు ప్రత్యేక వాహనాలతో గ్రామాలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలని, పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గూర్చి వివరిస్తూ చైతన్యవంతులను చేశారు. జిల్లాలో 'బడి బాట'ను పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది.



జిల్లా కేంద్రంలో డీఈవోతో కలిసి ప్రచార జాత ప్రారంభిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

కార్యక్రమాలు ఇలా..

6వ తేదీన ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులతో గ్రామసభ 7న ఉపాధ్యాయులు ఇంటింటి సందర్శనతోపాటు బడీడు పిల్లలను గుర్తించడం, 8,9,10తేదీల్లో కరపత్రాలతో ఇంటింటి ప్రచారం చేపట్టనున్నారు. అదేరోజు అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన, బడి మానేసిన పిల్లలను గుర్తించి చేర్పించడం, ప్రత్యేకావసరాల పిల్లలను అందుబాటులోని భవిత కేంద్రాల్లో ప్రవేశాలు కల్పించడం చేస్తారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమాలపై 11న సమీక్ష, 12న అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించడం, పిల్లలకు పాఠ్య, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేయనున్నారు. 19న బడి బాట ముగింపు సందర్భంగా పిల్లలకు క్విజ్ పోటీలు నిర్వహిస్తారు.

క్లుప్తంగా

బ్రెయిన్‌డెడ్‌తో యువకుడి మృతి

అవయవాలు దానం


వెంకటేష్ (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్ గ్రామానికి చెందిన యువకుడు బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందగా.. అవయవాలను ఆస్పత్రికి దానం చేశారు. గ్రామానికి చెందిన పెద్దోళ్ల వెంకటేష్(23) డిగ్రీ పూర్తి చేసి వ్యవసాయం చేస్తున్నాడు. కాగా గత నెల 30న ఇంటి వద్ద కాలుజారి మెట్లపై కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం అతడు మృతి చెందాడు. కాగా అతడి అవయవాలు దానం చేస్తే మరో మనిషి ప్రాణం కాపాడవచ్చని వైద్యులు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా అంగీకరించారు.

గుండెపోటుతో నవ వరుడు మృతి


కిరణ్ (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): పెళ్లై 14 రోజులు.. భవిష్యత్తు కోసం ఎన్నో కళలు.. చిలక గోరింకల్లా ఇతరులకు ఆదర్శ దంపతులుగా ఉండాలనుకున్నా గంపెడు ఆశ. ఇవేవీ నెరవేరకుండానే నవ వరుడు గుండెపోటుకు గురై మృత్యువాత పడిన ఘటన నర్సాపూర్ మండలంలోని అంసాన్‌పల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన గోల్బుల లక్ష్మి-వెంకటయ్యల ఒక్కగానొక్క కుమారుడు సాయి కిరణ్ (22) అలియాస్ చింటూ వివాహం అదే గ్రామానికి చెందిన యువతితో మే 21న జరిగింది. అతడు పెయింటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం గ్రామంలో జరిగిన వివాహ వేడుకలకు బ్యాండ్ కొట్టేందుకు వెళ్లాడు. రాత్రికి ఇంటికి వచ్చిన అతడు భోజనం చేసి నిద్రించాడు. ఉదయం లేచి కాలకృత్యాలు తీర్చుకునేందుకు బాత్రూమ్‌కు వెళ్లి అక్కడే పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ఆస్పత్రికి తరలించేలోపు అప్పటికే మృతి చెందాడు. సాయి కిరణ్ మృతితో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఏటీఎం చోరీకి యత్నం

నిందితుడి రిమాండ్


నిందితుడు గణేష్

జిన్నారం (పటాన్‌చెరు): ఏటీఎం చోరీకి పాల్పడిన దుండగుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం... నిందితుడు మాలి గణేశ్ మహారాష్ట్ర నుంచి వలస వచ్చి బీరప్ప బస్తీలో నివాసముంటున్నాడు. సోమవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో బీరప్ప బస్తీలోని హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎంను గడ్డపారతో ధ్వంసం చేసే క్రమంలో అలారం మోగడంతో వెంటనే పారిపోయాడు. ఏటీఎం సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా అదుపులోకి తీసుకున్నారు. విలాసాలకు అలవాటు పడి గతంలో కూడా బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు.

ఇంటి గోడలు కూల్చారని పోలీసులకు ఫిర్యాదు

జహీరాబాద్ టౌన్: ఇంటి నిర్మాణ పనులు చేపడుతుండగా కొందరు జేసీబీతో సోమవారం అర్ధరాత్రి కూల్చేశారని పట్టణంలోని ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన బస్వరాజ్ వాపోయారు. మహీంద్ర కాలనీలో గల బసవ మండపం పక్కన స్థలం కొనుగోలు చేశానని తెలిపారు. ఆ స్థలంలో ఇంటి నిర్మాణ పనులు చేపడుతుండగా జేసీబీతో గోడలను కూల్చారని ఆరోపించారు. ఈ మేరకు జహీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు.

నేల కొరిగిన స్తంభాలు తొలగించండి

నారాయణఖేడ్: వ్యవసాయ పొలాల్లో 11కేవీ విద్యుత్ స్తంభాలు నేల కొరిగి దుక్కులు దున్నుకునేటప్పుడు ఇబ్బందికరంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నేలకొరిగిన స్తంభాలను తొలగించాలని కోరుతూ ఖేడ్ మండలం అబ్బెందకు చెందిన పలువురు రైతులు మంగళవారం ఖేడ్ ట్రాన్స్‌కో ఏఈ నారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు.

బాలికా విద్యకు.. మరింత భరోసా

ఏడు కేజీబీవీల్లో ఇంటర్ తరగతులు ప్రారంభం

- 360 మంది బాలికలకు ప్రయోజనం
- సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు



నూతనంగా ఇంటర్ తరగతులు ప్రారంభం కానున్న న్యాల్‌కల్ కేజీబీవీ

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన చేసేందుకు ప్రభుత్వం రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆంగ్ల మాధ్యమంలో గురుకుల పాఠశాలలను ప్రారంభించింది. సక్సెస్ పాఠశాలల మాదిరిగా కేజీబీవీలో ఇంటర్ విద్యతో పాటు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడుతోంది. ప్రస్తుతం తల్లిదండ్రులు ఆంగ్ల బోధన వైపు మొగ్గు చూపుతుండటంతో పాటు ఆడ పిల్లల విషయంలో భద్రతను కూడా కోరుకుంటున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ఈ మేరకు జిల్లాలోని 7 కేజీబీవీలను ఇంటర్(ఆంగ్ల మాధ్యమం) వరకు ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది.

ఎలిమెంటరీ స్థాయి నుంచే బాలికలకు విద్యనందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2004లో జాతీయ విద్యా కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. కాని ఆ కార్యక్రమం వల్ల సరైన ఫలితాలు రాలేవు. దీంతో బాలికలకు పూర్తి స్థాయి విద్య నందించేందుకు సిబ్బందితో కూడిన హాస్టల్ వసతి సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించిన ప్రభుత్వం కేజీబీవీలను ప్రారంభించింది. మధ్యలోనే చదువులకు స్వస్తి చెబుతున్న బీద కుటుంబాలతో పాటు ఆర్థికంగా వెనుబడిన వర్గాలకు చెందిన (ఎస్సీ, ఎస్టీ, బీసీ) చెందిన బాలికల కోసం మండలానికి ఒకటి చొప్పున మొదట సంగారెడ్డి జిల్లాలో 17 కేజీబీవీలను ఏర్పాటు చేసింది. మూడేళ్ల క్రితం మరో ఐదు కేజీబీవీలకు శ్రీకారం చుట్టింది.

విద్యనభ్యసిస్తున్న 5వేల మంది

ఆరో తరగతి నుంచి 10వ వరకు గల విద్యాలయాల్లో 75 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన బాలికలకు, మిగతా 25 శాతం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి ప్రవేశం కల్పిస్తున్నారు. ఆయా విద్యాలయాల్లో సుమారు 5వేల మంది బాలికలు చదువుకుంటున్నారు. జిల్లాలో నాగిల్‌గిద్ద కేజీబీవీలో 8వ తరగతి వరకు, మొగుడంపల్లి, గుమ్మడిదల, చౌటకూర్‌లో 9వ తరగతి వరకు ఉంది. అందోల్, నారాయణఖేడ్, కొండాపూర్, ఝరాసంగం, రాయికోడ్, సదాశివపేట్, సిర్గాపూర్, సుల్తాన్‌పూర్, జిన్నారం, హాతి(కె) కేజీబీవీల్లో ఇంటర్ వరకు తరగతులు కొనసాగుతున్నాయి.

ఏడు కేజీబీవీల్లో ఇంటర్ వరకు..

ఈ విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని న్యాల్‌కల్, అత్నూర, కంగ్టి, కాశీంపూర్, తాట్‌పల్లి, హుస్మాన్ నగర్, పుల్‌కూర్తి ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేసినట్లు అధికారులు తెలిపారు. అప్‌గ్రేడ్ చేసిన విద్యాలయాల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతుందని అధికారులు తెలిపారు. రెండు కేజీబీవీల్లో రెండు గ్రూప్‌లు(ఎంపీసీ, బైపీసీ) గ్రూప్‌నకు 40 మంది చొప్పున 160 మంది, మిగిలిన విద్యాలయాల్లో ఎంఎల్‌టీలో గ్రూప్‌కు 40 చొప్పున 200 మంది బాలికలకు అడ్మిషన్ ఇవ్వనున్నారు. ఈ మేరకు అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయి. కేజీబీవీల్లో 10వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ పొందిన విద్యాలయాల్లో అధ్యాకుల నియామకానికి దరఖాస్తులు కూడా స్వీకరిస్తున్నారు.

సంతోషంగా ఉంది



10వ తరగతి వరకు ఉన్న విద్యాలయాన్ని ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయించడం సంతోషంగా ఉంది. పదో తరగతి పూర్తయిన తర్వాత బయటకు వెళ్లి చదువుకోవాలంటే ఆర్థికంగా కష్టం. ఇక్కడే ఇంటర్మీడియెట్ వరకు చదువుకునేందుకు అవకాశం కల్పించడం బాలికలందరికీ వరం.

– మేరీ, విద్యార్థిని, కేజీబీవీ, న్యాల్‌కల్

సిబ్బందిని త్వరలోనే నియమిస్తాం



జిల్లాలో ప్రస్తుతం 10 కేజీబీవీల్లో ఇంటర్ వరకు తరగతులు కొనసాగుతున్నాయి. కొత్తగా ఏడు కేజీబీవీలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాటిలో అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయి. బోధనా సిబ్బందిని త్వరలోనే నియమిస్తాం. తరగతులు త్వరలో ప్రారంభమవుతాయి.

– వెంకటేశ్వర్లు, డీఈఓ, సంగారెడ్డి

నాణ్యమైన విత్తనాలతోనే దిగుబడులు

సీడీసీ చైర్మన్ రాంరెడ్డి


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న రాంరెడ్డి తదితరులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని సీడీసీ చైర్మన్ రాంరెడ్డి రైతులకు సూచించారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన 'నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం'కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని మద్దికుంట రైతువేదికలో డీఏఓ శివప్రసాద్,వ్యవసాయ శాస్త్రవేత్త చంద్రశేఖర్‌తో కలిసి రాంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు సన్నరకం వరి,పెసర,కంది విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..నాణ్యతా ప్రమాణాలు పాటించి మంచి దిగుబడిని సాధించాలన్నారు. రోహిణి కార్తిలోనే వరి నార్లు పోసుకోవడం ద్వారా బలంగా పెరిగి చీడ పీడలను తట్టుకుని ముందుగా పంట చేతికి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటలక్ష్మి,ఏఎంసీ చైర్మన్ కుమార్,ఏఓ రమేశ్,ఏఈఓలు, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

మూల విత్తనాల పంపిణీ జరగాలి

సంగారెడ్డి టౌన్: విత్తన స్వయం సమృద్ధి లక్ష్యంగా రైతులకు విత్తనాల పంపిణీ సజావుగా జరగాలని ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త బాలాజీ నాయక్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి రైతువేదికలో మంగళవారం రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు దివ్యజ్యోతి, ఝాన్సీలక్ష్మి, శ్రావణ్‌కుమార్, గాయత్రీసౌజన్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాయికోడ్ మండలంలో..

రాయికోడ్(అందోల్): మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంటల సాగుపై శాస్త్రవేత్తలు, అధికారులు సూచనలు చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం వారి కంది, పెసర విత్తనాలను ఎంపిక చేసిన రైతులు మొగులప్ప, బక్కప్ప తదితరులకు అందజేసినట్లు ఏఈఓ నికిలేశ్ తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు నాగిశెట్టి పాటిల్, హన్మంగొండ, ఆలయ కమిటీ చైర్మన్ సతీశ్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏసయ్య, నాయకులు ఉన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత


నామా రవికిరణ్ సొంత ఖర్చుతో కట్టించిన ఇల్లు


ఇంటిని ప్రారంభించిన అనంతరం రాములు కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు

- సొంత డబ్బులతో ఇల్లు కట్టించిన నామ రవికిరణ్
- ప్రారంభించిన ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణానికి చెందిన నామ రవికిరణ్ పేదవారికి చేయూతనిస్తున్నారు. పట్టణంలోని బాగారెడ్డిపల్లికి చెందిన మక్కల రాములు ఐదుగురు సంతానంతో చాలాకాలం నుంచి దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నాడు. భార్య చనిపోవడంతో పాటు ఐదుగురు పిల్లలతో తలదాచుకునేందుకు గూడు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. గుహ లాంటి రేకుల షెడ్డులో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రాములు కుటుంబ పరిస్థితిని గమనించిన బీఆర్‌ఎస్ నాయకుడు, నామ సుభద్రమ్మ ట్రస్టు అధ్యక్షుడు నామ రవికిరణ్ సొంత ఖర్చుతో ఇల్లు కట్టించాడు. హరీశ్ రావుకు అభిమాని అయిన రవికిరణ్ ఆయన పుట్టినరోజున ఎమ్మెల్యే మాణిక్‌రావు చేతుల మీదుగా ప్రారంభించి ఇంటి తాళాలను రాములుకు అప్పగించారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు మాట్లాడుతూ రవికిరణ్ పేద కుటుంబానికి ఇల్లు కానుకగా ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అటవీ సిబ్బందిపై దాడికి యత్నం


ఆక్రమించిన అటవీ భూమిని స్వాధీనం చేసుకుని కందకం పనులు చేస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): ఆక్రమించిన అటవీ భూమిని గుర్తించి స్వాధీనం చేసుకుని చుట్టూ కందకం పనులు చేస్తున్న అటవీ సిబ్బందిపై దాడికి యత్నించారు. ఈ ఘటన మండల పరిధిలోని భోజ్యా పంచాయతీ జెంగ్యా తండాలో మంగళవారం చోటు చేసుకుంది. అధికారుల వివరాల ప్రకారం... శివ్వంపేట సెక్షన్ పరిధి దొంతి కంపార్ట్ 348లో అటవీ భూమిని తండాకు చెందిన వారు కబ్జా చేసి దున్నకం చేపట్టారు. విషయం తెలుసుకున్న అటవీ సిబ్బంది మంగళవారం తండాకు చేరుకుని కబ్జాకు పాల్పడిన వారికి అవగాహన కల్పించి భూమిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ భూమిలో జేసీబీలతో కందకం తవ్వకం పనులు చేపట్టారు. ఈ క్రమంలో పనులు చేస్తున్న అటవీ సిబ్బందిపై తండాకు చెందిన కోల చిట్టి గొడ్డలితో దాడి చేసేందుకు ప్రయత్నించిందని శివ్వంపేట సెక్షన్ అధికారి శ్రీధర్‌కుమార్ తెలిపారు. చిట్టి భర్త రాజు అటవీ సిబ్బందితో గొడవ పడ్డారని చెప్పారు. అటవీ భూమిని ఆక్రమించుకోవడంతో పాటు సిబ్బందిపై దాడికి యత్నించిన భార్యాభర్తలను పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. బీట్ అధికారి కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భూ భారతితో రైతులకు న్యాయం

ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్


మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్

న్యాల్‌కల్(జహీరాబాద్): రైతులకు న్యాయం చేసేందుకే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ అన్నారు. బీఆర్‌ఎస్ తీసుకువచ్చిన ధరణి పూర్తిగా లోపభూయిష్టంగా ఉందని ఆరోపించారు. మండలంలోని మిర్జాపూర్(ఎన్)గ్రామంలో మంగళవారం భూ భారతి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ హాజరై మాట్లాడారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకే ధరణిని తొలగించి భూభారతి చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. భూములకు సంబంధించిన సమస్యలు సాధ్యమైనంత వరకు తహసీల్దార్ స్థాయిలోనే పరిష్కారమవుతాయన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో ఉన్న చెరుకు రైతుల కోసం చెరకు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులను ప్రారంభించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ చంద్రశేఖర్, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, టీజీఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్ అహ్మద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఉజ్వల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కేతకీ ఆలయ చైర్మన్ శేఖర్, నాయకుల్లు పాల్గొన్నారు.

పొలానికి నీళ్లు పెట్టి వస్తుండగా..

- రైతును ఢీకొట్టిన కారు
- ప్రమాదంలో అక్కడికక్కడే మృతి


కోల రమేష్(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): పొలం దగ్గరికీ వెళ్లి ఇంటికి వస్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తునికిగేట్ సమీపంలోని దేవులతండావద్ద 765డి జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం.. దేవలతండాకు చెందిన కోల రమేష్(38) వ్యవసాయంతో పాటు గేదెలను పెంచుతున్నాడు. వీటి మేత కోసం పొలంలో పచ్చిగడ్డి సాగు చేశాడు. సోమవారం రాత్రి మడికి నీళ్లు పారించేందుకు పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి వస్తూ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న క్రమంలో మెదక్ వైపు నుంచి నర్సాపూర్ వైపు వెళ్తున్న కారు రమేష్‌ను ఢీకొట్టింది. దీంతో అతనికి తీవ్ర గాయాలై మృతి చెందాడు. మృతుడికి భార్య నీల, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో మహిళ..


మణెమ్మ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): రోడ్డు దాటుతున్న మహిళను ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన కుకునూరుపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ... మండల పరిధిలోని మంగోల్ గ్రామానికి చెందిన లగిశెట్టి మణెమ్మ(50) మనవడు అశ్విత్‌తో కలిసి ఆటోలో కుకునూరుపల్లికి మిరపకాయలు పట్టించడానికి బయలు దేరారు. ఈ క్రమంలో ఆటో దిగి రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు ద్విచక్ర వాహనంపై అతి వేగంగా వెళ్తున్న సెంట్రల్ పోలీస్ లైన్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న బుర్కి దేవానంద్ మహిళను ఢీకొట్టాడు. దీంతో ఆమె ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. కానీ ద్విచక్ర వాహనదారుడు వాహనాన్ని ఆపకుండా సుమారు కిలో మీటరు దూరం వరకు వెళ్లాడు. ఈ ఘటనను చూసిన స్థానికులు ద్విచక్ర వాహనదారున్ని పట్టుకునేందుకు ప్రయత్నించగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మృతదేహం వద్ద నానమ్మ, నానమ్మ అంటూ 12 ఏళ్ల మనవడు అశ్విత్ రోదించడం అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది. వాహనం ఆపకుండా వెళ్లడం పట్ల మృతురాలి కుటుంబీకులు, గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి గొడవకు దిగారు. పోలీసులు సర్ది చెప్పి, కేసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

గజ్వేల్‌రూరల్: వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ రింగురోడ్డు మార్గంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బాబాయ్ కిచెన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి తీవ్ర గాయాలకు గురై ఉన్నాడు. సమాచారం మేరకు బ్లూకోర్ట్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సుమారు 45 ఏళ్లుండి, చామనచాయ కలర్ ఉన్నాడు. ఒంటిపై తెలుపురంగు ప్యాంట్, నలుపు రంగు షర్ట్‌పై తెలుపు గీతలు ఉన్నాయి. ముఖానికి, పొట్ట వద్ద గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వాహనం ఢీకొని దివ్యాంగుడికి..

దుబ్బాకరూరల్: వాహనం ఢీకొని దివ్యాంగుడికి గాయాలైన ఘటన హబ్షీపూర్ గ్రామ శివారులో జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దివ్యాంగుడు భూమయ్య మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. విధుల నిమిత్తం పాఠశాలకు తన త్రిచక్ర వాహనంపై వెళ్తున్నాడు. సిద్దిపేట వైపు నుంచి వస్తున్న ఎర్టిగ వాహనం దివ్యాంగుడి త్రిచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో అతని కాలు విరిగింది. దివ్యాంగున్ని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎర్టిగ వాహనంలో ఉన్న తల్లి, కూతుళ్లకు స్వల్పంగా గాయాలయ్యాయి. వీరిని 108లో సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా వీరు మెదక్ జిల్లాకు చెందిన వారు. వేములవాడలో దైవ దర్శనం చేసుకుని తిరిగి మెదక్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

బుల్లెట్‌ను ఢీకొట్టిన కారు..

నర్సాపూర్ రూరల్: బుల్లెట్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మంగళవారం నర్సాపూర్ – సంగారెడ్డి రహదారిలోని మాల్‌వాల ఆయిల్ మిల్ ఎదుట జరిగింది. నర్సాపూర్‌లో నివాసం ఉంటున్న విభీషణ్ రెడ్డి సంగారెడ్డి నుంచి బుల్లెట్‌పై వస్తుండగా వెనక నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు విభీషణ్ రెడ్డిని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అతడిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. విభీషణ్ రెడ్డి ప్రయాణిస్తున్న బుల్లెట్‌ను వెనుక నుంచి కారుతో ఢీకొట్టి హతమార్చాలనే కుట్రతోనే చేశారని స్థానికులు, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నర్సాపూర్ ఎస్సై లింగంను వివరణ కోరగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



చిగురాకుల చీరకట్టి.. కొప్పన పూలెట్టి

ముందస్తుగా కురిసిన తొలకరి వర్షాలతో చెట్లు, మొక్కలు చిగురులు తొడిగి పచ్చదనాన్ని సింగారించుకుంటున్నాయి. పూల మొక్కలు పూలతో వికసిస్తుండగా, ఇతర చెట్లు పూలు, పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మెదక్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గుల్‌మెహర్ చెట్టు ఎర్రటి పూలతో వికసించగా...అక్కడే ఉన్న చింత చెట్టు పచ్చని చిగురుతో ఆకట్టుకుంటుంది.

– మెదక్ కలెక్టరేట్:

కుటుంబ కలహాలతో భార్యాభర్తల ఆత్మహత్య


రమేశ్ (ఫైల్)


అనిత (ఫైల్)

మునిపల్లి(అందోల్): కుటుంబ కలహాలతో భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దగోపులారం గ్రామంలో చోటు చేసుకుంది. బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బేగరి రమేశ్‌కు 13 సంవత్సరాల క్రితం కోహిర్ మండలం బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన అనితతో వివాహం అయింది. వీరికి ముగ్గురు సంతానం. రమేశ్ తన భార్యపై అనుమానం పెంచుకోవడంతో మూడు నెలల నుంచి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 2వ తేదీన అర్ధరాత్రి సమయంలో భార్యాభర్తలు గొడవ పడి ఇంట్లో ఐరన్ రాడ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ సత్తయ్య గౌడ్, సీఐ వెంకటేశం, క్లూస్ టీం సిబ్బంది వచ్చి పరిశీలించారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త..


శ్రీకాంత్(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): భార్య కాపురానికి రావడం లేదని భర్త గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని రాజీపేట గ్రామానికి చెందిన బాంచ శ్రీకాంత్(30)కి శివ్వంపేట మండలం గంగాయిపల్లికి చెందిన స్వాతితో ఏడాది క్రితం వివాహం అయింది. పదిహేను రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగగా స్వాతి పుట్టింటికి వెళ్లింది. భార్యను తీసుకొచ్చేందుకు అత్తగారింటికి శ్రీకాంత్ వెళ్లగా ఇక్కడికి రాలేదని చెప్పి పంపారు. అనంతరం 31న మరోసారి అతడు వెళ్లగా భార్య కుటుంబ సభ్యులు కాపురానికి పంపమని, విడాకులు తీసుకుంటామని చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన అతడు ఇంటికి వచ్చి గడ్డి మందు తాగాడు. అనంతరం అన్న బాలకృష్ణతో విషయం చెప్పడంతో బాధితుడ్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు.

చెరువులో దూకి వృద్ధురాలు..

హవేళిఘణాపూర్(మెదక్): అనారోగ్యంతో ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మెదక్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుసులపల్లి గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన నాగారం రామవ్వ(80) కుమారుడు సిద్దిరాంలుకు స్వగ్రామంలో ఇల్లు లేకపోవడంతో మెదక్ పట్టణం పిల్లికొట్టాల్ వద్ద గల ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్‌లో నివాసముంటున్నారు. సోమవారం రామవ్వ స్వగ్రామం అవుసులపల్లి గ్రామానికి వెళ్తానని చెప్పింది. రాత్రి వరకు రాలేదు. ఉదయం గ్రామ శివారులో ఉన్న చెరువులో మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుందని, మనస్తాపంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని మృతుడి కుమారుడు సిద్దిరాంలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాల సదనం నుంచి కూతురును పంపబోమన్నందుకు..

పాపన్నపేట(మెదక్): బాల్య వివాహమై బాల సదనంలో ఉన్న కూతురును ఇంటికి పంపించాలని తల్లిదండ్రులు అధికారులను కోరగా వారు నిరాకరించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక తల్లిదండ్రులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని ఏడుపాయల్లో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... శివ్వంపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న బాలికకు 15 రోజుల క్రితం ములుగు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకునితో వివాహం జరిగింది. ఈ విషయం బయటకు రావడంతో సోమవారం ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు బాలిక తల్లిదండ్రులు, పెళ్లి కుమారునిపై కేసు నమోదు చేసి బాలికను మెదక్ బాల సదనంకు తరలించారు. మంగళవారం బాలికను చూసేందుకు బాలసదనం వెళ్లిన తల్లిదండ్రులు తమ కూతురును ఇంటికి పంపించాలని ఐసీడీఎస్ అధికారులను కోరారు. ఆమెను ఏదైనా రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివిస్తామని ఐసీడీఎస్ డీపీఓ కరుణ స్పష్టం చేశారు. దీంతో మనస్తాపం చెందిన బాలిక తల్లిదండ్రులు ఏడుపాయలకు వచ్చి, విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. అనంతరం వారు తమ సోదరులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.